అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కీసర: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రతిభ చూపిన క్రాంతి కీస్ అకాడమీ విద్యార్థులను రాజ్ భవన్ రోడ్‌లోని దిల్‌కుషా హౌస్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలోగా తెలంగాణలో నూతన సైనిక్ స్కూల్ స్థాపించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు



శామీర్‌పేట్: ఉద్దెమర్రి విష్ణు శివాలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు సుప్రభాత సేవ, వాయిద్యా గోష్ఠి, నిత్యార్చన, మూలమంత్ర హవనం, సుదర్శన హోమం, రుద్ర హవనం, బలిహరణం, మహా దాశీర్వచనం, ఋత్విక్ సన్మానం, తీర్థప్రసాదం వితరణ నిర్వహించారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాం



శామీర్‌పేట్: రెండు కాలనీల మధ్య నెలకొన్న రోడ్డు సమస్యను పరిష్కరించామని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయంజాల్‌లో గల తిరుమలకాలనీ–ఎస్సీకాలనీకి మధ్యలో ప్రహరీని మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీతో శుక్రవారం తొలగించారు. అనధికార నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని సేవలు

- జిల్లాలో మొదటి విడతలో 67 ఆరోగ్య కేంద్రాల్లో షురూ
- పీహెచ్‌సీలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ దశలవారీగా 6 రకాల సేవలు
- 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్'లతో మరింత ప్రయోజనం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాల్లో (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్)లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో పాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

వైద్యులకు శిక్షణ పూర్తి..

జిల్లావ్యాప్తంగా 103 ఆరోగ్య ఉప కేంద్రాల్లోని 70 కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చారు. కొత్తగా మరో 112 బస్తీ దవాఖానాలను పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటిలో ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సును నియమించి కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్'లుగా నామకరణం చేసింది. ఈ ఆసుపత్రుల్లో మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్సతో పాటు అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి మాత్రలు అందజేస్తోంది. ఇక్కడ అందుబాటులో లేని సేవల కోసం సమీప జిల్లా కేంద్ర ఆసుపత్రి, ఏరియా, సీఎంసీలకు తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు

జిల్లా ఆసుపత్రి: మల్కాజిగిరి (డీహెచ్)
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు : 04
పీహెచ్‌సీలు : 12 (11 డెలివరీ పాయింట్స్)
యూపీహెచ్‌సీఎస్: 26 (6 డెలివరీ పాయింట్స్)
24 గంటల దవాఖానాలు: 12 (8 పీహెచ్‌సీఎస్, 5యూపీహెచ్‌సీఎస్)
బస్తీ దవాఖానాలు: 112
ఆర్యోగ ఉపకేంద్రాలు: 103 (ఇందులో 70 పల్లె దవాఖానాలు)

విడతల వారీగా..

ప్రస్తుతం సాధారణ వైద్య సేవలతో పాటు కంటి చూపు, ముక్కు, గొంతు, చెవి, దంత సమస్యలు, మానసిక సమస్యలు, ఎలర్జీతో బాధపడే వారికి సైతం చికిత్స అందిస్తున్నారు. ఇందుకు సంబంధించి గతంలో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నిపుణుల ద్వారా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మొదటి దశలో ప్రస్తుతం ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో మూడో వంతు అంటే 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరు రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొత్తంగా మూడు విడతల్లో ప్రత్యేక సేవలు విస్తరించడంతో పాటు ప్రాథమిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు అనుసంధానం చేస్తారు.

అవసరమైతే ఇతర ఆసుపత్రులకు..

రోగులకు వైద్యం విషయంలో వైద్యావిధాన పరిషత్ వైద్యులు తోడ్పాటును అందించడంతో పాటు ప్రతీ నెలలో 2 రోజులు ఆయా ఆసుపత్రులను సందర్శించి గుర్తించిన రోగులకు చికిత్స అందేలా చూస్తారు. అవసరమైన వారిని సమీప జిల్లా ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి పంపిస్తారు.

ప్రజలకు ఎంతో ప్రయోజనం..

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్లలో వైద్య సేవలు విస్తరించడంతో బస్తీ, పల్లె ప్రజలకు వైద్యం మెరుగవుతోంది. ఈ ప్రత్యేక వైద్య సేవల్లో భాగంగా ప్రజలకు ఆరుకు పైగా సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యశాఖ పర్యవేక్షణ కూడా ఉంటోంది. మూడు విడతల్లో ప్రత్యేక వైద్య సేవలు విస్తరిస్తాం.

–డాక్టర్.ఉమాగౌరీ, డీఎంహెచ్ఓ, మేడ్చల్–మల్కాజిగిరి

'జెప్టో సంస్థ కార్మిక హక్కులను కాలరాస్తోంది'

కొనసాగుతున్న డెలివరీ వర్కర్ల నిరవధిక సమ్మె



డెలివరీ వర్కర్ల సమస్యను పరిష్కరించాలని అదనపు కార్మిక కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీజీపీడబ్ల్యూయూ ప్రతినిధులు

సాక్షి,సిటీబ్యూరో: జెప్టో డెలివరీ వర్కర్ల నిరవధిక సమ్మెకు దిగారు. జెప్టో సంస్థ కార్మిక హక్కులు కాలరాస్తుండటంపై తక్షణ జోక్యం చేసుకోవాలని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అదనపు కార్మిక కమిషనర్ గంగాధర్‌కు శుక్రవారం యూనియన్ నేతలు వినతిపత్రం సమర్పించారు. శ్రమకు తగిన వేతనం, సామాజిక భద్రత, న్యాయమైన పని గంటలు, ఉద్యోగ గౌరవం వంటి డిమాండ్లతో రామంతాపూర్, బోడుప్పల్‌తో పాటు పలు డార్క్ స్టోర్ల వద్ద ఐదు రోజులుగా జెప్టో డెలివరీ వర్కర్లు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ... ఇది కేవలం వేతనాల కోసం కాదని హక్కులు, గుర్తింపు కోసం చేస్తున్న పోరాటమని తెలిపారు. ప్రభుత్వం జెప్టో వంటి యాప్ ఆధారిత కంపెనీలపై జవాబుదారీతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించేందుకు కార్మిక శాఖ, జెప్టో మేనేజ్‌మెంట్, యూనియన్ ప్రతినిధులతో త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామ పాలన అధికారి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి,సిటీబ్యూరో: ఈనెల 25న (ఆదివారం) నిర్వహించనున్న గ్రామ పాలన అధికారి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి మహిళా డిగ్రీ కాలేజీలో జిల్లాలోని 52 మంది అర్హులైన (ఆప్షన్ ఇచ్చిన) వీఆర్‌ఓలు (అభ్యర్థులు) హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు మాత్రమే లోనికి అనుమతిస్తారని, అభ్యర్థులు గమనించి అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 733720990 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

దేశ సంస్కృతి పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి హర్షణీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య వక్త చంద్రశేఖర్

పోచారం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అన్నోజిగూడలోని శ్రీవిద్యా విహార్ ఉన్నత పాఠశాలలో కార్యకర్త వికాస వర్గ సార్వజనిక ఉత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కెప్టెన్ వినీత్‌సింగ్ రామావత్, వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్ర శేఖర్, వర్గ సర్వాధికారిగా లక్ష్మినేని ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామావత్ మాట్లాడుతూ.. సమాజానికి సేవా భావంతో పనిచేసే కార్యకర్తల అవసరం ఎంతో ఉందన్నారు. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కృషి హర్షణీయమని అన్నారు. ముఖ్య వక్త చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సమాజం పట్ల ప్రతి వ్యక్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో యువత కీలక భూమిక వహించాలన్నారు.

ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగుచేయాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట్: ఆధునిక పద్ధతిలో కూరగాయ పంటలను సాగుచేసి అధిక దిగుబడులు పొందాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) జీడిమెట్ల ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై నూతన వ్యవసాయ పద్ధతులపై ఒకరోజు రైతు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యానశాఖ అధికారులు ఇస్తున్న సూచనలను పాటిస్తూ నూతన పద్ధతులలో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొంది ఆర్థికంగా రైతులు ఎదగాలని సూచించారు. కూరగాయల పంటలలో వచ్చే పురుగులు, వ్యాధుల నివారణ పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్లు అనిత, సురేష్‌రెడ్డి, నిరోషా, నేట ఫిమ్ ఆగ్రోనామిస్ట్, సుబ్బారావు, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి జలంధర్, మండల వ్యవసాయ అధికారి రవికుమార్, మండల ఉద్యానాధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్‌గౌడ్, పాన్నాల్, మూడు చింతలపల్లి, అద్రాస్‌పల్లి, అనంతారం, ఉద్దమర్రి వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ తరగతుల పరిశీలన



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను డీఈఓ విజయ కుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కమలాకర్ , రీసోర్స్ పర్సన్ రాజు, శశికుమార్, పుష్పలత, శ్వేత, హరి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో పట్టణంలోని పలు కాలనీల్లో ఈనెల 24న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కంట్రీ క్లబ్, వీకర్ సెక్షన్, ఎస్‌వీఆర్ కాలనీ, ఏకలవ్యనగర్, బ్యాంక్ కాలనీ, సాయిబాబానగర్, జ్యోతినగర్, మార్కెట్ ప్రాంతం, పాత గ్రామ పంచాయతీ ప్రాంతం, హరిజనవాడ, చాకలి బస్తీ, నవోదయనగర్, సూర్యనగర్, మల్లికార్జుననగర్, రైల్వేస్టేషన్ ప్రాంతం, కేఎల్‌ఆర్‌నగర్ కాలనీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

యువజన కాంగ్రెస్ నాయకులకు మంత్రి శ్రీధర్‌బాబు సూచన



కీసర: యువజన కాంగ్రెస్ నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో తీసుకెళ్లాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. రాహుల్‌గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైట్ టీషర్ట్ ఉద్యమానికి తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి నాంది పలుకుతున్నారని అన్నారు. శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంపల్లిదాయరలోని బాలవికాస కేంద్రంలో యువజన నేతలకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆయన మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. ఈ రోజు మాజీ ప్రధాని ఇందిరాగాంధీని దేశ ప్రజలు గుర్తుచేస్తున్నారంటే వారు భారతదేశ అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలేనని అన్నారు.

సమాచార విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ...

ఆధునీకరణపై దృష్టి సారించి, కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి దేశంలో సమాచార విప్లవ పితామహుడిగా గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని గుర్తు చేశారు. విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించి శ్రీలంక, సోవియట్ యూనియన్‌తో సంబంధాలను మెరుగుపరచడానికి కృషి చేసారని తెలిపారు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేయడంతో పాటు ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారన్నారు.

వైట్ టీ షర్ట్ ఉద్యమం చాలా గొప్పది...

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలపై బీజేపీ ప్రభుత్వంపైన పోరాడుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైట్ టీ షర్ట్ ఉద్యమం చాలా గొప్పదని కొనియాడారు. వైట్ టీషర్ట్ కేవలం వస్త్రం ముక్క కాదని ఇది మన ఐదు మార్గదర్శక సూత్రాలకు చిహ్నమని పేర్కొన్నారు. కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం అందరికి పురోగతి అని అన్నారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కష్టపడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. తాము యువజన కాంగ్రెస్‌లో పనిచేస్తూ ఈ స్థాయికి వచ్చామన్నారు.

యువజన కాంగ్రెస్ నేతలకు అండగా ఉంటాం...

యువజన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అదే విధంగా బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాల్సిన యువ నాయకులపై ఉందన్నారు. నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడానికి కృషి చేయాలని సూచించారు. యువజన కాంగ్రెస్ నేతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ట్రాన్స్‌ఫార్మర్‌పై మృతి చెందిన లింగం

మేడ్చల్: కరెంట్ రావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రిపేర్లు చేస్తున్న వ్యక్తి విద్యుదాఘాతానికి బలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన దుందిగళ్ళ లింగం(53) గ్రామంలో ఏళ్లుగా ఎలక్ట్రిషన్ పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ప్రాంతంలో ఉన్న లేబర్ క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా రావడం లేదని ఫోన్ రావడంతో అక్కడకు వెళ్లాడు. క్వార్టర్స్‌లో కరెంట్ చెక్ చేసిన లింగం మూడు ఫేజ్‌లలో ఒక ఫేజ్ కరెంట్ సరఫరా రావడం లేదని గుర్తించి అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడే మరమ్మతులు చేస్తుండగా ఆయన కాలికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగ తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. లింగంను పనికి పిలిచిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఆయన మరణవార్త తెలుసుకున్న లింగం కుటుంబసభ్యులు గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

చెట్టుని ఢీకొని యువకుడి మృతి



మృతుడు జీవన్ సాయి

శామీర్‌పేట్: చెట్టుని ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలపిన వివరాల ప్రకారరం... శామీర్‌పేటకు చెందిన సోగడి జీవన్ సాయి (25), తన ద్విచక్ర వాహనం ఓ శుభకార్యానికి వెళ్లి కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారి గుండా ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో శామీర్‌పేట గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.